

ఏనుగు దాడిలో రైతుకు తీవ్రగాయాలు

బెంగళూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కొడగు జిల్లా విరాజ్‌పేట తాలూకాలోని అమ్మత్తి గ్రామం వద్ద కాఫీ తోటకు వెళ్తున్న రైతుపై ఏనుగు దాడి చేసింది. గురువారం చోటు చేసుకున్న ఘటనలో రైతు బొమ్మండ నాచప్ప (74) తీవ్రంగా గాయపడ్డాడు. తల, నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. అమ్మత్తి గ్రామ ఆసుపత్రిలో చికిత్సలు పొందిన అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. స్థానిక అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రాష్ట్ర వన్యజీవి మండలి సభ్యుడు సంకేత్ పూవయ్య ఆసుపత్రికి వెళ్లి రైతును పరామర్శించారు.

మంతనాల మర్మమేమిటో..?

- కాంగ్రెస్‌లో ఏదో జరుగుతోంది...
- డీకే శివకుమార్, సతీశ్ జార్కిహొళి భేటీపై సర్వత్రా చర్చ
- సిద్దూకు అండగా ఉంటారా..?


ఇటీవల డీకే శివకుమార్‌తో సతీశ్‌జార్కిహొళి మంతనాలు



బెంగళూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో ఏదో జరుగుతోంది. 'ముడా' అవినీతి కేసులో ముఖ్యమంత్రి సిద్దరామయ్యను ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇచ్చిన గవర్నర్‌పై మూకుమ్మడిగా నాయకులంతా తిరగబడ్డా ఈ మద్దతు ఎంతకాలమనేది చర్చలకు దారితీస్తోంది. సీఎం సిద్దరామయ్యకు హైకోర్టు కల్పించిన పది రోజుల గడువు తాత్కాలిక ఉపశమనమేనా అన్న చర్చ జరుగుతోంది. కోర్టు కూడా ప్రాసిక్యూషన్‌కు సరే అంటూ సంకేతాలు ఇచ్చినా.. లేదా ఏ ఏజెన్సీ అయినా విచారణకు ముందుకెళ్లి కేసు నమోదు చేసినా.. అప్పుడు ఆయన వెంట ఉండేది ఎంతమంది అనే చర్చ కూడా సాగుతోంది. ముఖ్యమంత్రి ప్రాసిక్యూషన్‌కు అనుమతులపై ఇండియా కూటమిలోని పార్టీలు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ ఈ విషయమై ప్రశ్నించినట్టు సమాచారం. మరికొన్ని రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు రానున్న నేపథ్యంలో కర్ణాటక విషయానికి మద్దతు ఇవ్వలేమని కూడా తేల్చి చెప్పినట్టు సమాచారం. సిద్దరామయ్య స్థానానికి ఎవరిని ఎంపిక చేయాలనే చర్చ ఇప్పటికే పార్టీలో సాగుతున్నట్టు తెలుస్తోంది. గవర్నర్ నుంచి ప్రాసిక్యూషన్‌కు అనుమతులు వచ్చిన తర్వాత పలు అంశాలను సున్నితంగా పరిశీలించాల్సిన అవసరం ఏర్పడుతోంది. కొన్నేళ్లకాలంగా కాంగ్రెస్‌లో బద్ధశత్రువులుగా వ్యవహరించిన డీసీఎం డీకే శివకుమార్, మంత్రి సతీశ్‌జార్కిహొళి భేటీ కావడం కొత్త చర్చలకు దారితీస్తోంది. నెలరోజుల కిందటే సతీశ్‌జార్కిహొళిని మెంటల్ ఆసుపత్రికి పంపించాలని డీసీఎం మండిపడ్డారు. అంతలోనే వారు కుమారకృపలో భేటీ కావడం, కేవలం ఇద్దరే కొన్ని గంటలపాటు చర్చలు జరపడం కూడా కీలకమవుతోంది. కలబురగిలో పర్యటించిన డీసీఎం రాష్ట్రంలో మరో పదేళ్లపాటు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని వ్యాఖ్యానించారు. కానీ సిద్దరామయ్య సీఎంగా కొనసాగుతారనే విషయం మాట్లాడలేదు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రాష్ట్రంలోని పరిస్థితులు సమగ్రంగా తెలుసు. గవర్నర్ జారీ చేసిన నోటీసు సరైనదా, తప్పా అని చెప్పలేనంటూ వ్యాఖ్యానించారు. ఇటీవల ఖర్గే జన్మదినం రోజున ఆయన ఇంటివద్ద కాబోయే సీఎం అంటూ అభిమానులు నినాదాలు చేశారు. దీన్ని అర్థమేమిటో అన్న ప్రశ్నలు ఉద్భవిస్తున్నాయి. సిద్దరామయ్య 'అహింద' నేతగా ఎదిగినవారు. సామాన్య వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయనవైపే ఉన్నారు. కానీ ఈ మద్దతు క్లిష్టసమయంలో కూడా కొనసాగుతుందా అనేది కీలకం కానుంది. అధిష్ఠానం తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసి పనితీరు మార్చుకోకున్నా ప్రతిపక్షాల విమర్శలపై స్పందించకున్నా దసరా నాటికి విస్తరణ ఉంటుందనే అల్టిమేటం దేనికి సంకేతమనేది తేలాల్సి ఉంది. ప్రస్తుతానికి కేబినెట్, ఎమ్మెల్యేలు సీఎం సిద్దరామయ్యకు మద్దతు ఇస్తున్నా అగ్రనేతల్లో వ్యతిరేకించేవారు లేకపోలేదు. రాష్ట్ర కాంగ్రెస్‌లో దశాబ్దకాలంగా మూడు గ్రూపులు ఉన్నాయి. అందులో సిద్దరామయ్య, డీకే శివకుమార్, మల్లికార్జున ఖర్గేకు వారి అనుచరవర్గాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వంలో సీఎం, డీసీఎంకు ఎక్కువ మంది మద్దతుదారులు ఉన్నారు. కానీ, సమస్య ఢిల్లీదాకా వెళ్తే ఖర్గే మాటకు విలువ ఉంటుంది.

గవర్నర్‌ను అవమానిస్తారా..?

సీఎం రాజీనామా చేసే దాకా విరమించేది లేదు
పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి
కాంగ్రెస్ తీరుకు నిరసనగా బీజేపీ ఆందోళన


ఫ్రీడం పార్కులో నిరసన చేపట్టిన బీజేపీ నేతలు

బెంగళూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగబద్ధమైన హోదాలో ఉన్న గవర్నర్ పట్ల అవమానం చేసేలా కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిందని, ముఖ్యమంత్రి రాజీనామా చేసేదాకా ఆందోళనలు విరమించేది లేదని పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో ఫ్రీడంపార్కులో గురువారం చేపట్టిన నిరసనకు మాజీ డీసీఎం అశ్వత్థనారాయణ, ఎమ్మెల్యేలు మునిరత్న, రవికుమార్, ఉమేశ్‌తోపాటు పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చలవాది నారాయణస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోని దళిత ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గవర్నర్‌ను అవమానించినవారిని వెనకేసుకు రావడం సరికాదన్నారు. తాను బీసీ అయినందునే బీజేపీ వేధిస్తోందని సీఎం చెబుతున్నారని, అలా అయితే ప్రధానమంత్రి ఎవరని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమిని కొనుగోలు చేయడం న్యాయమా అన్నారు. సిద్దరామయ్య దళితులకు కేటాయించిన గ్రాంట్లను ఇతర ప్రయోజనాలకు ఉపయోగించారని, ముడా భూములు దళితులకు చెందినవని, వాల్మీకి కార్పొరేషన్‌లో ఎవరి కోసం కేటాయించిన గ్రాంట్లను అక్రమంగా బదిలీ చేశారని ప్రశ్నించారు. బెళగావి, హుబ్బళ్ళితోపాటు పలు ప్రాంతాలలో ఆందోళన చేశారు.

హెబ్బాళ నుంచి సిల్క్‌బోర్డ్‌కు
సొరంగ మార్గం

బీజేపీ-జేడీఎస్ నేతల పాతకేసుల్లో ప్రాసిక్యూషన్
కేబినెట్‌లో పలు తీర్మానాలు

బెంగళూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిత్యం పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు హెబ్బాళ నుంచి సిల్క్‌బోర్డు దాకా సొరంగమార్గం నిర్మాణాలకు కేబినెట్ తీర్మానించింది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన గురువారం కేబినెట్ భేటీ జరిగింది. కేబినెట్ తీర్మానాలను న్యాయ, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు తెలిపారు. హెబ్బాళలోని ఎస్టీమ్ మాల్ నుంచి సిల్క్‌బోర్డు దాకా 18 కిలోమీటర్ల మేర సొరంగమార్గంలో నిర్మాణానికి సాంకేతికంగా అంగీకరించామని తెలిపారు. ఇందుకు రూ.12,690 కోట్లు ఖర్చు కానుందని అంచనా వేశామన్నారు. డీపీఆర్ సిద్ధం కావాల్సి ఉందన్నారు. బెంగళూరులో పర్యాటకులను ఆకర్షించేందుకు రూ.500 కోట్లతో స్కైడెక్ నిర్మాణానికి తీర్మానించామని తెలిపారు. నగరం నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే మార్గం సహజంగానే ట్రాఫిక్ ఉంటుందని, ఫ్లై ఓవర్లు, ఎలివేటెడ్ కారిడార్, గ్రేట్ సపరేటర్లు నిర్మించినా ఒత్తిడి తగ్గడంలేదన్నారు. దీంతో సొరంగ మార్గ నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. తొలి విడతగా ఎస్టీమ్ మాల్ నుంచి మేఖ్రి సర్కిల్‌కు 3 కిలోమీటర్ల మేర నిర్మిస్తామని పేర్కొన్నారు. రెండో విడతలో సిల్క్‌బోర్డ్ వరకు విస్తరింపచేసే ఆలోచన ఉందన్నారు. చైనాలోని షాంఘైలో షాంఘై టవర్, ఆస్ట్రియాలో కూప్ హిమ్మెల్బ్ సంస్థ, వరల్డ్ డిజైన్ ఆర్గనైజేషన్, స్కైడెక్ నిర్మాణాలు జరిపిందన్నారు. బెంగళూరుకు వచ్చే ప్రయాణికులు, సందర్శకులకు ప్రత్యేకమైన 'స్కైడెక్' ఆకర్షణీయం కానుందన్నారు. గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండే బీజేపీ, జేడీఎస్ కీలకనేతల వివాదాలపై ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వాలని తీర్మానించామన్నారు. కేంద్రమంత్రి కుమారస్వామి, బీజేపీకి చెందిన మాజీ మంత్రులు మురుగేశ్ నిరాణి, శశికళ జొల్లె, గాలి జనార్దనరెడ్డిపై పెండింగ్‌లో ఉండే వివాదాల్లో రెండింటికి చార్జ్‌షీట్ దాఖలయ్యాయని మంత్రి వివరించారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి గ్రాంట్లను కేటాయిస్తూ తీర్మానించామన్నారు.


సీఎల్పీ సమావేశంలో సీఎం, డీసీఎంతో పాటు పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు

సీఎంకు అండగా ఉంటాం

- గవర్నర్ తీరు ఆక్షేపణీయం
- ప్రతిపక్షాల కుట్రలను అడ్డుకుంటాం
- మద్దతుగా నిలిచిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు
- ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్


మీడియాతో మాట్లాడుతున్న డీసీఎం డీకే శివకుమార్, పక్కన సీఎం సిద్దరామయ్య, మంత్రులు

బెంగళూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా ప్రాసిక్యూషన్‌కు అనుమతించిన గవర్నర్ తీరును ఆక్షేపిస్తూ తీర్మానం తీసుకున్నామని, ఎమ్మెల్యేలంతా సీఎంకు అండగా ఉంటారని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడించారు. విధానసౌధలో గురువారం సీఎల్పీ సమావేశం అనంతరం డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ ఎటువంటి ప్రాథమిక విచారణ లేకుండా ముఖ్యమంత్రిపై సెక్షన్ 17ఎ కింద దర్యాప్తునకు అనుమతించిన గవర్నర్ నిర్ణయాన్ని ఖండిస్తూ సీనియర్ ఎమ్మెల్యే ఆర్‌వీ దేశ్‌పాండే ప్రతిపాదించారన్నారు. ఇందుకు తన్వీర్ సేఠ్ మద్దతు ఇచ్చారని తెలిపారు. పార్టీలోని ఎమ్మెల్యేలందరూ ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు అండగా ఉంటామని మద్దతు తెలిపారని అన్నారు. సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొన్నారని వివరించారు. స్పీకర్ ఆదేశాలతో ఆరుగురు ఎమ్మెల్యేలు ఢిల్లీలో జరుగుతున్న శిక్షణ శిబిరానికి వెళ్లారని తెలిపారు. ముఖ్యమంత్రికి మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు ధర్నా చేస్తున్నారని వారికి అభినందనలని పేర్కొన్నారు. రాష్ట్రంలో 136 మంది ఎమ్మెల్యేలు గెలుపొంది ప్రభుత్వం ఏర్పాటు చేశామన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా అత్యధిక మెజారిటీతో ఏర్పాటైన ప్రభుత్వాన్ని అస్థిరం చేసేందుకు బీజేపీ, జేడీఎస్ కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. శుక్రవారం అధిష్ఠానం పెద్దలతో భేటీ ఉందని తాను, సీఎం వెళ్లి ప్రస్తుత రాజకీయాలపై చర్చించనున్నట్టు తెలిపారు. గవర్నర్ తీరుపై కోర్టులో న్యాయపోరాటానికి అర్జీలు సమర్పించామని పేర్కొన్నారు.

కుట్రలను అడ్డుకుంటాం

ఒక ప్రసంగాన్ని నెపం చేసుకుని రాహుల్ గాంధీని ఎంపీ స్థానం నుంచి అనర్హత వేటు వేసిన రీతిలో ముఖ్యమంత్రిపై కూడా కుట్ర పన్నారని, ఇలాంటి వాటిని అడ్డుకుంటామని డీసీఎం డీకే శికుమార్ అన్నారు. తమకు ప్రజాబలం ఉందని, రాజ్యాంగపరంగా కొనసాగేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. 'ఇండియా' కూటమి మద్దతు ఉందా అని ప్రశ్నించగా కూటమి పుట్టిందే ఇక్కడని, దేశవ్యాప్తంగా 234 సీట్లు సాధించినట్టు తెలిపారు. ప్రస్తుతం కలసికట్టుగా పోరాటం చేయనున్నట్టు తెలిపారు. శుక్రవారం ఢిల్లీలో పార్టీ పెద్దల చర్చల అనంతరం వివరిస్తానని అన్నారు. గవర్నర్ నిర్ణయాన్ని మంత్రివర్గం ఖండిస్తూ తీసుకున్న తీర్మానాన్ని పంపారా అని ప్రశ్నించగా గవర్నర్ తమ ఘనతను కాపాడుకునేందుకు ఇప్పుడైనా ప్రాసిక్యూషన్‌కు ఇచ్చిన అనుమతులను విరమించుకోవాలని, దీనిపై తాము న్యాయపోరాటానికి సన్నద్ధమని, లేనిపక్షంలో ఆయనకు భంగపాటు తప్పదన్నారు.


మహారథోత్సవం

తుంగాతీరం ఆధ్యాత్మికతతో ఉప్పొంగింది. ఇష్టదైవం రాఘవేంద్రుడి వైభవాన్ని చూసి భక్తులు పరవశించిపోయారు. ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం భక్తజనసంద్రమైంది. గుండెల నిండా భక్తి నింపుకుని దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. 'మూలరామా విజయతే.. తుంగా తీరా నివాసా గోవిందా గోవిందా.. జయహో గురు రాఘవేంద్ర విజయహో పూజ్యాయ రాఘవేంద్రాయ నమో నమః' అంటూ భక్తుల రాఘవరాయుల నామస్మరణతో శ్రీమఠం మారుమోగింది. రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాల్లో ఐదో రోజు అత్యంత ముఖ్యమైన ఉత్తరాధనలో భాగంగా గురువారం మహా రథోత్సవం వైభవంగా సాగింది.

జయహో రాఘవేంద్ర


పల్లకిలో ఊరేగుతున్న ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు

- వైభవంగా రాఘవేంద్రుడి మహారథోత్సవం
- భక్తులతో పులకరించిన తుంగా తీరం
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న నృత్యాలు
- రథోత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులు



మంత్రాలయం, ఆగస్టు 22: జగద్గురు మంత్రాలయం రాఘవేంద్రస్వామి సప్తరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం ఉత్తరాధన పురస్కరించుకుని మహా రథోత్సవం కన్నులపండువగా జరిగింది. శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు ఉదయం సుప్రభాత సేవతో ఉత్సవాలకు అంకురార్పన పలికారు. వజ్ర వైఢూర్య రత్నాలతో పొదిగిన హారం, బంగారు ఆభరణాలతో అలంకృతుడైన ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను సంస్కృత పాఠశాల వరకు ఊరేగించి తిరిగి శ్రీమఠానికి తీసుకువచ్చారు. అనంతరం ఉత్సవమూర్తికి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు పూజలు చేసి మహామంగళహారతులు ఇచ్చారు. వసంతోత్సవంలో భాగంగా మఠం అర్చకులు, సిబ్బంది, భక్తులపై రంగులు చల్లుతూ ఉత్సాహంగా ముందుకు సాగారు. ఉత్సవమూర్తిని రథంపైకి అధిష్టింపుండగా.. లక్షలాది మంది భక్తులు జయహో గురు రాఘవేంద్ర.. విజయహో అంటూ పెద్ద ఎత్తున జయధ్వానాలు పలికారు. మహారథంపై నుంచి భక్తులకు పీఠాధిపతి అభివాదం చేశారు. శ్రీమఠం మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్ నుంచి మహారథం ముందుకు సాగుతుండగా చండీవాయిద్యాలు, నాదాహారం, కోలాట నృత్యాలు, బీరప్పడోలు, భజన మండల భక్తి పాటలు, మంగళవాయిద్యాలు, దేవతామూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. రాఘవేంద్ర సర్కిల్ వద్ద యువత బాణాసంచా పేలుస్తూ నృత్యాలు చేశారు. అనంతరం శ్రీమఠానికి చేరుకున్న మహారథం నుంచి ఉత్సవమూర్తిని బృందావనం ముందు ఉంచి పూజలు చేశారు. రథోత్సవంలో పండిత కేసరి విద్వాన్ రాజా ఎస్.గిరిరాజాచార్, మఠం దివాన్ సుజీంద్రాచార్, ఆనంద తీర్థాచార్, గౌతమాచార్, శ్రీమఠం ఉత్తర భారతదేశ విచారణ కర్త శ్రీనివాస్ కస్బే, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈలు బద్రినాథ్, శ్రీహరి, వ్యాసరాజాచార్, బిందు మాధవ్, సూపరింటెండెంట్లు అనంతపురాణిక్, రవి కులకర్ణి, జేపీ స్వామి, విజయేంద్రాచార్, ద్వారపాలక అనంత స్వామి, ప్రకాష్ ఆచార్, జయతీర్థాచార్, వాదిరాజాచార్‌లు పాల్గొన్నారు.

రథోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

రాఘవేంద్ర స్వామి మహారథోత్సవ వేడుకల్లో కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ రామచంద్ర ఉదార్, మైసూరు మహారాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ వడియార్ తదితరులు పాల్గొన్నారు. ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాల మేరకు 325 మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా యోగీంద్ర కళామండపంలో గురువారం రాత్రి బెంగుళూరు చెందిన ప్రభాత్ కళా బృందం నృత్యరూపకం, ధార్వాడకు చెందిన పండిత్ వెంకటేశ్ కుమార్ హిందుస్థాని వోకల్ సంగీతం భక్తులను అలరించింది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1623.32	1,628.23
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	44,721	2,384
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	61,424	9,797
సామర్థ్యం (టీఎంసీలు)	78.14	87.56

వైభవంగా రాఘవేంద్ర స్వామి ఆరాధన



దాసవాణి కీర్తనలను ఆలపిస్తున్న భక్తులు

బళ్లారి సిటీ, ఆగస్టు 22: నగరంలోని కౌల్‌బజార్ మారవాడి గణేశ్ దేవస్థానంలో శ్రీ గురురాజ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం రాఘవేంద్ర స్వామివారి 353వ ఆరాధనమహోత్సవం వైభవంగా జరిగింది. పండిట్ శ్రీజయసింహ రాఘవేంద్రస్వామి జీవితంపై ప్రత్యేక ఉపన్యాసంచేశారు. తదనంతరం కులకర్ణి ప్రసంగించారు. శ్రీగురురాజ సేవాసమితి వారు కళాకారులను సత్కరించారు. శ్రీ రాఘవేంద్రస్వామివారి ధ్వజాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. ఈసందర్భంగా కమిటీ అధ్యక్షులు సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు గురురాజ్, అనంత, అనంతచార్య, సత్య నారాయణరావ్, వేణుగోపాల్, భీమరావ్‌కులకర్ణి, భువనేంద్ర ఆచార్, అనంతకృష్ణ, ప్రభంజన్‌కుమార్, కేశవ, ఉష తదితరులు పాల్గొన్నారు.

సిరుగుప్ప: పట్టణంలో గురువారం రాఘవేంద్ర స్వామి ఉత్సవాలు అత్యంత ఘనంగా సాగాయి. ఉత్తరాధనను పురస్కరించుకుని స్వామివారిని రథంలో ఊరేగించారు. భక్తులు కోలాటం, భజనలు ప్రదర్శించారు. ఉత్సవంలో భారీసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



సిరుగుప్పలో మహిళల కోలాటం

27న గ్రూప్ 'ఏ, బి' పోస్టుల భర్తీకి పరీక్ష



బళ్లారి సిటీ, ఆగస్టు 22: గెజిటెడ్ ప్రొబేషనరీ ఏ, బీ, గ్రూప్ పోస్టుల భర్తీకి ఆగస్టు 27న కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరఫున పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లా మేజిస్ట్రేట్ ప్రశాంత్‌కుమార్ పరీక్షా కేంద్రం చుట్టూ 200మీటర్ల ప్రాంతాన్ని నిషేధిత ప్రాంతంగా ప్రకటించారు. ఆ రోజున 15 పరీక్షా కేంద్రాల సమీపంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జిరాక్స్ , ఇంటర్‌నెట్ సెంటర్లు పనిచేయకుండా చూడాలని ఆదేశించారు.

వినాయక ఆలయంలో లక్షార్చన



రజతకవచ అలంకరణలో వినాయకస్వామి

హోసూరు, ఆగస్టు 22: హోసూరు భారతీ నగర్ ప్రాంతంలో వెలసిన శ్రీ వినాయక ఆలయ 26వ వార్షిక లక్షార్చన మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఇందులో వేలాది మంది భక్తులు పాల్గొని వినాయకుడిని దర్శించుకున్నారు. అరసనట్టి ప్రాంతంలోని ఈ ఆలయంలో బాలసుబ్రమణ్య, దక్షిణామూర్తి, దుర్గ, బ్రహ్మ, విష్ణు, నవగ్రహాలు మొదలైన దేవతలు కొలువుదీరారు. ఈ సందర్భంగా వరుసగా రెండు రోజుల పాటు ఆలయంలో స్వామివారికి వివిధ పూజలు, ప్రత్యేక సేవలు జరిగాయి. ఉత్సవాల్లో ప్రధానంగా తెల్లవారుజామున వినాయకుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వెండి కవచం అలంకరణతో స్వామివారు దర్శనమిచ్చారు. అలాగే మహా సంకష్టహర చతుర్థి సందర్భంగా మహా గణపతి హోమం అనంతరం జరిగిన మహా సంకల్పానికి వేలాది మంది భక్తులు హాజరయ్యారు. అనంతరం వివిధ పుష్పాలతో పాటు గులాబీ, వైఢూర్యాలు, మల్లెపూలతో లక్షనామాలతో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. అందరికీ తీర్థ ప్రసాదాలు అందించారు.

తుంగభద్ర బోర్డులో చెల్లింపుల మ్యాజిక్

రూ. 70 / 360 కోట్లు

- ఓట్ ఆన్ అకౌంట్ క్రింద రూ.70కోట్లు విడుదల
- చెల్లించాల్సింది రూ.360కోట్లకు పైమాటే
- తలలు పట్టుకుంటున్న బోర్డు అధికారులు...
- బిల్లుల కోసం క్యూ కట్టిన కాంట్రాక్టర్లు



బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 22: తుంగభద్ర బోర్డు పరిధిలోని హెచ్చెల్సీ, ఎల్లెల్సీ కాలువల అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు గత మూడేళ్ళుగా బిల్లుల బకాయిలు పెరిగిపోవడంతో బోర్డు పనులు అంటేనే కాంట్రాక్టర్లు వెనకడుగు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. జగన్ ప్రభుత్వంలో గత 22 నెలలకు పైగా చేసిన పనులకు బిల్లులు చెల్లించక పోవడంతో బోర్డులో రూ 360 కోట్లకు పైగా బకాయిలు పెరిగిపోవడంతో బోర్డు చుట్టు కాంట్రాక్టర్లు చెప్పులు అరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓట్ ఆన్‌అకౌంట్ క్రింద తుంగభద్ర బోర్డు పనుల నిర్వహణ నిమిత్తం రూ 70 కోట్ల రూపాయల నిధులు విడుదలైనట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం. ప్రస్తుతం విడుదలైన ఈ నిధులను కాంట్రాక్టర్లకు ఏరకంగా పంపిణీ చేయాలో అర్థంకాక బోర్డు అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాతైనా కష్టాల నుండి గట్టెక్కుతామన్న ఆశతో ఉన్న కాంట్రాక్టర్లను తుంగభద్ర జలాశయం 19వ గేటు కొట్టుకు పోయిన ఘటన నిరాశపరిచింది. ఈ ఘటనలో అపార ప్రమాణంలో వరద నీరు వృథా కావడంతో సుమారు 8రోజుల పాటు గేటు ఏర్పాటులో బోర్డు అధికారులు తలమునకలయ్యారు. గేటు పునర్నిర్మాణ పర్యవేక్షణలో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ ఆర్థిక శాఖామంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు, భారీ నీటి పారుదల శాఖామంత్రి, రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, ఇతర ప్రముఖులు డ్యామ్‌ను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. పనిలో పనిగా పలువురు కాంట్రాక్టర్లు ప్రస్తుతం బోర్డు పరిధిలో చేపట్టిన పనులకు చెల్లించాల్సిన బిల్లు బకాయిల గురించి మంత్రి దృష్టికి తీసుకెళ్ళడంతో వారి సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. గత నెల ఆంధ్ర రాష్ట్ర బడ్జెట్ పూర్తి స్థాయిలో ప్రవేశ పెట్టకపోయినా... అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు తాత్కాలిక బడ్జెట్‌కింద రూ. 70 కోట్లు రూపాయల నిధులు విడుదల చేసినట్లు సమాచారం. ఈ నిధులను ఏరకంగా పంపిణీ చేయాలో అర్థం కాక బోర్డు అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. కాంట్రాక్టర్లు మాత్రం బిల్లులు మొత్తం పొందడానికి బోర్డు అధికారులపై నాయకుల నుంచి ఒత్తిడి తీసుకున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా... ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఆర్థిక పరిస్థితిని బట్టి చూస్తే ఇప్పట్లో బోర్డు పనులు చేసిన కాంట్రాక్టర్లకు పూర్తిస్థాయిలో బిల్లులు రావడం గగనమేననిపిస్తోంది.

వర్ష బాధితులకు తక్షణ సాయం

- డిప్యూటీ కలెక్టర్ మహ్మద్‌జుబేరా ఆదేశం

బళ్లారి సిటీ, ఆగస్టు 22: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల పలు చోట్ల నష్టం వాటిల్లింది. అధికారులు సత్వరమే సహాయక చర్యలు చేపట్టాలని డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేరా సూచించారు. జిల్లానూతన పాలనా భవనంలోని వీడియో హాల్లో వర్ష నష్టంపై అన్ని తాలూకాల తహసీల్దార్లతో గురువారం ఏర్పాటు చేసిన జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాల వల్ల ప్రభుత్వ ఆస్తులకు, ప్రైవేట్ వ్యక్తుల ఇళ్లకు జరిగిన నష్టంపై గ్రామస్థాయి అధికారుల నుంచి వివరాలు సేకరించి తాలూకావారీగా నివేదిక అందజేయాలని తహశీల్దార్లకు సూచించారు. నిర్దేశిత రూపంలో కార్యాయం తప్పకుండా జిల్లాలో గత



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ మహ్మద్‌జుబేరా

48గంటల్లో 57ఇళ్లు పాక్షికంగా, 4గుడిసెలు దెబ్బతిన్నాయి. వర్షాకాలంలో ఇళ్లు కూలిపోయి ప్రాణ నష్టం జరుగుతున్నట్లు గమనించిన వెంటనే సంబంధిత తహశీల్దార్, గ్రామసహాయకులు సంఘటన స్థలాన్ని సందర్శించాలన్నారు. నిబంధనల ప్రకారం వారికి పరిహారం పంపిణీలో జాప్యం చేయరాదన్నారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో ఏర్పడే లోటుపాట్లను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాలను బలోపేతంచేయాలన్నారు. విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని జెస్కామ్ అధికారులను ఆదేశించారు. గ్రామాల వారీగా తాగునీరు సరఫరా చేయాలని, ఈ విషయంలో తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని పంచాయితీరాజ్ సాంకేతిక శాఖ, మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులకు సూచించారు. కంప్లి, సిరుగుప్ప ప్రాంతాల్లో ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో పశువుల సురక్షిత కేంద్రాలను గుర్తించాలన్నారు. పశువులకు అవసరమైన మేత నిల్వ ఉంచుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులను కోరారు. అగ్నిమాపక, అత్యవసర సేవల దళాలను సిద్ధంగా ఉంచాలని, డిపార్టుమెంట్‌లో అందుబాటులో ఉన్న రెస్క్యూపరికరాల సమాచారాన్ని సంకలనం చేయాలని, అన్నిపరికరాలు సరైన స్థితిలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు పోలీసు సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, వ్యవసాయ సంయుక్త సంచాలకులు కే.సోమసుందర్ తదితర జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

విస్తరణలో అదృష్టం ఎవరిదో?

- మంత్రి పదవి రేసులో కంప్లి ఎమ్మెల్యే గణేష్, సిరుగుప్ప ఎమ్మెల్యే నాగరాజు, బళ్లారి నగర ఎమ్మెల్యే భరతరెడ్డి

బళ్లారి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సీఎం సిద్ధరామయ్యను మైసూర్ నగరాభివృద్ధి(ముడా) వివాదం ముసురుకుంది. దీనిపై కాంగ్రెస్, బీజేపీ రాజకీయ ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. ఇంటా బయటా పోరాటాన్ని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ కూడా తన జట్టును సిద్ధం చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో సిద్దరామయ్య క్యాబినెట్ విస్తరణ చేసేందుకు ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు పచ్చజెండా ఊపారని తెలుస్తోంది. ప్రస్తుతం మంత్రివర్గంలోని కొందరిని తప్పించి, వారి స్థానంలో కొత్త వారిని ఎన్నుకొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. విధానపరిషత్‌లో ఉండే ఒక సీనియర్ నాయకుడికి మంత్రి వర్గంలో స్థానం ఇచ్చే అవకాశం ఉన్నట్లు రాజకీయ వర్గాలు అంటున్నాయి. క్యాబినెట్ మంత్రి నాగేంద్ర ఎస్టీ నిగమమండలిలో జరిగిన అవినీతిపై జైలుకు చేరడంతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో ఖాళీ పడిన మంత్రి పదవిని భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయి. ఆ స్థానాన్ని బళ్లారి జిల్లాలో ఉండే ఎమ్మెల్యేలతో భర్తీ చేస్తారా? లేదా పార్టీలో సీనియరుకు అవకాశం ఇచ్చి బళ్లారి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమిస్తారా? అనే విషయమై రాజకీయంగా చర్చలు సాగుతున్నాయి. కంప్లి ఎమ్మెల్యే గణేష్, సిరుగుప్ప ఎమ్మెల్యే నాగరాజు, బళ్లారి నగర ఎమ్మెల్యే భరతరెడ్డి ఈ ముగ్గురూ మంత్రి రేసులో ఉన్నారని సమాచారం. విజయనగర జిల్లా ఎమ్మెల్యే గవియప్ప, లేదా విధానపరిషత్ సభ్యుడు బీకే హరిప్రసాద్ ఇద్దరిలో ఒకరికి మంత్రి పదవి ఇవ్వాలనే చర్చ కూడా సాగుతోంది. విధానపరిషత్‌లో ప్రతిపక్ష నాయకులకు గట్టిగా బదులిచ్చే సీనియర్ నాయకులను మంత్రివర్గంలో చేర్చుకోవాలని కాంగ్రెస్ పెద్దలు చెప్పినట్లు సమాచారం. అయితే మంత్రి వర్గంలో స్థానం కోసం ఎవరి ప్రయత్నం వారు చేస్తున్నారు. మరి లక్ ఎవరిని వరిస్తుందో?!

కుమార మెడకు గనుల లీజు వివాదం



బళ్లారి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయం రగులుతోంది. సిద్దరామయ్యను ముఖ్యమంత్రి సీటు నుంచి దించాలని బీజేపీ-దళం కూటమి తరఫున కుమారస్వామి పాచికలు వేస్తుంటే, ఇందుకు సరైన బదులు ఇవ్వాలని కాంగ్రెస్ ఎదురు ఎత్తులు వేస్తోంది. సీఎం సిద్దరామయ్య ముడాలో 15 ప్లాట్ల వివాదంలో చిక్కుకుంటే, మాజీ సీఎం, కేంద్ర మంత్రి కుమారస్వామి ఏకంగా 550 ఎకరాల మైనింగ్ లీజులో అవినీతికి పాల్పడ్డారని కాంగ్రెస్ ప్రత్యారోపణలు చేస్తోంది.

మహారాష్ట్రకు చెందిన శ్రీ సాయి వెంకటేశ్వర మినరల్స్ కంపెనీ 2006 ఏప్రిల్ 17న బళ్లారి జిల్లా సండూరులో ఇనుప గనుల తవ్వకాలకు దరఖాస్తు చేసుకుంది. ఆ కంపెనీ తనకు భూగర్భంలో గనుల తవ్వకాలలో అనుభవం ఉందని పేర్కొంటూ దరఖాస్తు చేసుకున్నప్పటికీ వాస్తవానికి ఆ కంపెనీకి ఎక్కడా మైనింగ్ కార్యకలాపాలు చేసిన అనుభవం లేదని తెలుస్తోంది. అప్పట్లో శ్రీ సాయి వెంకటేశ్వర మినరల్స్ కంపెనీతో పాటు మరో 28 కంపెనీలు సండూరు అటవీ ప్రాంతంలో మైనింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నాయి. అయితే 2007 అక్టోబర్ 10న హెచ్‌డీ కుమారస్వామి ముఖ్య మంత్రిగా ఉన్న కాలంలో సీఎం సంతకంతో పాటు అప్పటి సీఎం కార్యదర్శిగా ఉన్న డి.వి ప్రసాద్ ఈ ఫైల్ పైన సంతకం చేసి వాణిజ్యపరిశ్రమల శాఖకు పంపించారు. అదే రోజు ఆ ఫైల్‌కు సంబంధించిన పనులన్నీ పూర్తిచేసి అన్ని ఒకేరోజు మైనింగ్ లీజ్‌కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని తెలుస్తోంది. అయితే మైనింగ్ కోసం అటవీ భూమిని రిజిస్ట్రేషన్ లేని కంపెనీకి కేటాయించారని, ఇందులో అనేక అవకతవకలు జరిగాయని, లోకాయుక్త జస్టిస్ యూవీ సింగ్ నివేదిక ఇచ్చినట్టు తెలుస్తోంది.

ఈ కంపెనీకి ఏ రాష్ట్రంలోనూ బ్యాంకు ఖాతా లేదని, అలాగే బ్యాంకు ద్వారా లావాదేవీలు చేసినట్లు ఎక్కడా రికార్డులు కూడా లేవని గతంలో లోకాయుక్త జస్టిస్ సంతోష్ హెగ్డే కూడా నివేదిక ఇచ్చారని అంటున్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కేంద్ర గనుల శాఖ మంత్రిగా ఉన్న కుమారస్వామి ఈ ప్రాంతంలో గనులు లీజ్‌కు వేగంగా ఫైల్స్ కదుపుతున్నారని తెలుస్తోంది. కనుక ఈ లీజ్‌లపై చర్యలు తీసుకోవాలని ప్రస్తుత సిద్దా ప్రభుత్వం భావిస్తోంది. ఇలా ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటున్నారు. ఈ పరిణామాలు ఏ టర్న్ తీసుకుంటాయో వేచిచూడాల్సిందే.

వేదవతి ఉరకలేస్తోంది..



హగరి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వేదవతి నది

బళ్లారి రూరల్, ఆగస్టు 22: వేదవతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వారం రోజుల నుండి విస్తారంగా వానలు పడడంతో నదిలోకి భారీగా నీరు చేరి మోకా, రూపనగుడి, రాయాపురం, యర్రగుడి, డీడీ హల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. అలాగే రైతులు సాగు చేసుకున్న పొలాలు నీట మునిగాయి. అనేక గ్రామాలకు రాకపోకలు నిల్చిపోయాయి. దీనికి తోడు బీటీపీ ప్రాజెక్టు నుండి కూడా నీరు వస్తుండడంతో నది పొంగిపొర్లుతోంది.

ఆయకట్టు కింద వరినాట్ల జోరు



బళ్లారి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఆయకట్టులో వరినాట్లు సూపందుకున్నాయి. డ్యాం నుండి నీరు పంట కాలవలకు విడుదల చేస్తుండడంతో రైతులు పంట పొలాల్లో నాట్లు పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. హెచ్చెల్సీ, ఎల్లెల్సీ, ఆర్‌బీఎంఎల్‌సీ, వివిధ ప్రధాన కాలువలకు డ్యాం నుండి నీరు విడుదల చేశారు. ప్రధాన కాలువలతో పాటు పంట కాలవలకు నీరు పుష్కలంగా ప్రవహిస్తుండంతో రైతులు నాట్లు వేసుకోవడంతో బిజీగా ఉన్నారు.

దేశాభివృద్ధిలో యువజనుల పాత్ర కీలకం

- జాతీయ అంతరిక్ష దినోత్సవంలో డా.సుధాకర్‌రావు



అమ్మపేరుతో మొక్కలు నాటుతున్న అధికారులు, విద్యార్థులు

బళ్లారి సిటీ, ఆగస్టు 22: సమగ్ర దేశాభివృద్ధిలో యువజన సంఘాల పాత్ర ఎంతో కీలకమని, దేశ ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువతరం చేతులు కలపాలని దూరదర్శన్ కేంద్రం విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకరరావు అన్నారు. వీరశైవ అసోసియేషన్ జిల్లా కన్నడ సాహిత్య పరిషత్, కేంద్రసమాచార ప్రసార శాఖ, జిల్లాకన్నడ సాహిత్య పరిషత్, వీరశైవ పూర్వ గ్రాడ్యుయేట్ల సంఘం కళాశాల ఆడిటోరియంలో గురువారం ఏర్పాటు చేసిన జాతీయ అంతరిక్ష దినోత్సవ ప్రత్యేక ఉపన్యాసంలో ఆయన మాట్లాడారు. విద్యా, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైజ్ఞానిక, సాంకేతిక రంగాల్లో దేశం విజయపథంలో పయనించాలంటే యువత చురుకుగా ఉండాలన్నారు. కిష్కింధా యూనివర్శిటీ రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ విభాగం డీన్ ప్రొ.మంజునాథ్ మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయవంతంగా ప్రయోగించడం వల్ల భారతదేశ కీర్తి ఉన్నత స్థాయికి చేరిందని, ఇది మనందరికీ గర్వకారణమని గుర్తుచేశారు. వీరశైవ కళాశాల పూర్వ విద్యార్థి రామచంద్రరావు ఇస్రోలో శాస్త్రవేత్తగా పనిచేసి ఆర్యభట్ట, రోహిణీ సహా 20కిపైగా ఉపగ్రహాలకు కేంద్రబిందువుగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. ఇస్రోచంద్రయాన్-3 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించినందుకు గుర్తుగా జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, బళ్లారిలోని కమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్, నోడల్ ఆఫీసర్ అక్షత తెలిపారు. విద్యార్థులు, పరిశోధనలు, అంతరిక్ష అధ్యయనాల వైపు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మంజునాథ్ చంద్రయాన్-3 రాకెట్ ప్రయోగాన్ని విద్యార్థులకు ప్రదర్శించారు. అంతకుముందు వీరశైవ కళాశాల ఆవరణలో నిర్వహించిన 'అమ్మపేరుతో మొక్కలు నాటే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

రాయచూరు ఎంపీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ

రాయచూరు, ఆగస్టు 22 : నగరంలోని జిల్లాధికారి కార్యాలయం సమీపంలో కొత్తగా సిద్ధం చేసిన రాయచూరు లోకసభ సభ్యుడి క్యాంప్ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. భవనానికి మరమ్మత్తులు పూర్తి చేయడంతో గురువారం ఉదయం 6 గంటలకు ఎంపీ జీ కుమార్ నాయక్ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి తన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎంపీ, లోకసభ నియోజక వర్గం పరిధిలోని ప్రజలు తమ సమస్యలను నేరుగా కార్యాలయానికి వచ్చి తనతో చెప్పుకోవచ్చునన్నారు. నిర్దేశిత సమయంలో అందుబాటులో ఉండాలని లోకసభ సమావేశాల సమయంలో మినహా తక్కిన సమయాల్లో ఈ కేంద్రంలోనే గడుపుతానని తెలిపారు.

హోసూరు జోన్

వాలీబాల్ పోటీల్లో రాణించిన విద్యార్థులు



ప్రథమస్థానంలో నిలిచిన ఆర్‌వీ ప్రభుత్వ బాలుర జట్టు

హోసూరు ఆగస్టు 22: హోసూరు వాలీబాల్ టోర్నమెంట్‌ను గురువారం అధియమాన్ కళాశాలలో నిర్వహించారు. ఇందులో హోసూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. ముల్లై నగర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిచింది. 14 సంవత్సరాల లోపు రెండవ స్థానాన్ని ఆర్‌వి బాలుర ప్రభుత్వ పాఠశాల గెలుచుకుంది. గెలుపొందిన జట్టు కృష్ణగిరి రెవిన్యూ విద్యా జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించింది. హోసూరు ఆర్వీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ వెంకటేశ్, వాలీబాల్ కోచ్ థాయిమానవన్ అభినందనలు తెలిపారు.

లైంగిక వేధింపుల ఘటనలో నిందితుల అరెస్ట్

హోసూరు(కృష్ణగిరి) ఆగస్టు 22 : కృష్ణగిరి జిల్లా బర్గూరు సమీపంలోని గండికుప్పం ప్రాంతంల్లో నిర్వహిస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాలలో నకిలీ టీచర్ ఎన్‌సీసీ క్యాంపు నిర్వహించగా కొందరు విద్యార్థినులపై లైంగిక వేధింపులు చోటుచేసుకోవడంతో జిల్లా పోలీసు శాఖ తక్షణమే చర్యలు చేపట్టి నిందితులందరినీ అరెస్ట్ చేసి కోర్టు కస్టడీకి పంపింది. ఈ ఘటనలపై విచారణ జరిపి సంబంధిత వ్యక్తులందరిపై తగినచర్యలు తీసుకోవాలని, పైఘటనపై 15 రోజుల్లోగా అన్ని విచారణలను పూర్తిచేసి దోషులను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

డీఎంకే ఆర్గనైజర్ల నియామకంపై చర్చలు

హోసూరు, ఆగస్టు 22: కృష్ణగిరి జిల్లా డీఎంకే కన్సల్టేటివ్ సమావేశం జిల్లా కార్యాలయం హోసూరులో జరిగింది. దీనికి జిల్లా కార్యదర్శి వై.ప్రకాశ్, ఎం ఆల్ చీఫ్ హాజరుకాగా యూనియన్ స్థాయిల్లో టీమ్‌ల ఆర్గనైజర్లు, సబ్ ఆర్గనైజర్ల నియామకంపై చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మురుగన్, స్పీకర్ యువరాజ్, జిల్లా ఉప కార్యదర్శులు చిన్నస్వామి, పుష్ప సర్వేశ్, కోషాధికారి సుకుమారన్, జనరల్ కమిటీ సభ్యులు శ్రీనివాసన్, ధనలక్ష్మి, అబ్దుల్ కలాం, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, సంయుక్త కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు శ్రీనివాస రెడ్డి, దివాకర్, రఘునాథ్, నాగేశ్, సిన్నారాజ్, భాగ్యరాజు, రాజా, కరుణాకరన్, గజేంద్రమూర్తి, శ్రీధర్, పేరూరు కార్యదర్శులు శ్రీనివాసులు, పురపాలక శాఖ ఉపకార్యదర్శి గోపాలకృష్ణ, ఏరియా కార్యదర్శులు అధిక సంఖ్యల్లో పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే వై.ప్రకాశ్

గవర్నర్‌ను నిందించడం రాజ్యాంగ ధిక్కారమే

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివరాజ్ పాటిల్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివరాజ్ పాటిల్

రాయచూరు, ఆగస్టు 22: ముడా అక్రమాలకు సంబంధించి ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ అనుమతించడం ముమ్మాటికి నిబంధనలకనుగుణంగానే జరిగిందని సిటీ ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివరాజ్ పాటిల్ అన్నారు. ఈ విషయంలో గవర్నర్‌ను నిందిస్తూ అనుచితవ్యాఖ్యలు చేస్తున్న ప్రభుత్వతీరు రాజ్యాంగ ధిక్కారమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరును నిరశిస్తూ బీజేపీ నాయకులు గురువారం నగరంలో ధర్నా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టిన నాయకులు ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన పాటిల్ ముడా అవినీతి వ్యవహారాలకు సం బంధించి తాము సభలోనే ప్రభుత్వాన్ని పలు వివరాలు కోరామని వాటికి ఎలాంటి సమాధానం చెప్పకుండా దాటవేసిన సిద్ధరామయ్య రోడ్లపై అల్లర్లు చేయాలనుకోవడం హాస్యస్పదమన్నారు. శాసనసభలో అడిగిన ప్రశ్నలకు జవాబులివ్వకుండా దాటవేసిన ముఖ్యమంత్రికి రాజ్యాంగం పట్ల, ప్రజల పట్ల ఎలాంటి గౌరవం లేదని ఆరోపించారు.

ముందస్తు హెచ్చరిక లేకుండా దుకాణాల సీజ్ చేస్తారా?

నగరసభ అధికారుల తీరుపై వ్యాపారుల అసంతృప్తి

రాయచూరు, ఆగస్టు 22 : నగరంలోని వ్యాపార సమూదాయాలు లైసెన్స్‌ల రెన్యూవల్ తదితర అంశాలకు సంబంధించి నగరసభ అధికారులు తీసుకుంటున్న నిర్ణయం పట్ల వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉన్నఫళంగా దుకాణాలను సీజ్ చేయడం పట్ల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో వ్యాపారులు, ఇతర వాణిజ్య పరిశ్రమల ప్రతినిధులతో గురువారం నగరసభ కమిషనర్ గురుసిద్దయ్య హిరేమఠ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వాణిజోద్యమ సంఘం అధ్యక్షుడు అశోక్ కుమార్ 1964 మున్సిపల్ చట్టం ప్రకారం పలు దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ మినహాయింపు వద్దని అధికారులకు వివరించారు. పెండింగ్‌లో ఉన్న పన్నులు కట్టేందుకు దుకాణాల యజమానులు సిద్ధంగానే ఉన్నారని స్పష్టం చేశారు. కాగా అధికారులు ఉన్నఫళంగా దుకాణాలకు తాళాలు వేయడం, సీజ్ చేయడంతో గౌరవానికి భంగం వాటిల్లిందంటూ పలువురు వ్యాపారులు తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నగరసభ కమిసనర్ ఇప్పటికే పలు సార్లు ప్రకటనలు ఇచ్చామని మున్సిపల్ వాహనం ద్వారా దండోరా కూడా వేయించామని తెలిపారు. కాగా పెండింగ్ పన్నుల వసూలు కోసం ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేస్తామని సహకరించాలని కోరారు.

నీటి చార్జీలు పెంచక తప్పదు

» ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో నీటి చార్జీలు పెంచక తప్పదని, ఎవరుతిట్టినా, ఎన్ని ఆందోళనలు చేసినా ఆపే ప్రసక్తే లేదని ఉపముఖ్యమంత్రి, బెంగళూరు నగరాభివృద్ధిశాఖ మంత్రి డీకే శివకుమార్ తేల్చి చెప్పారు. 1.40 కోట్ల మంది బెంగళూరులో నివసిస్తున్నారని, మేకెదాటు ప్రాజెక్టు నిర్మాణంపై విశ్వాసం ఉందని, సాధ్యమైనంత త్వరగా అమలు చేస్తామన్నారు. శరావతి నుంచి తాగునీటి ప్రాజెక్టు ఆలోచన ఉందన్నారు. దీనిపై శివమొగ్గ తోపాటు పలు జిల్లాల్లో వ్యతిరేకత ఉందని, నీటి ప్రాజెక్టులపై కొత్త బిల్లులు తెచ్చామన్నారు. గురువారం విధానసౌధ ప్రాంగణంలో నగర పరిధిలోకి చేరిన 110 గ్రామాలకు కావేరి నీటి సరఫరాకు శ్రీకారం చుట్టారు. వర్షపునీటి సద్వినియోగం, వరుణమిత్రలకు శిక్షణ, యునైటెడ్ నేషన్స్ ఇన్నోవేషన్ ప్రాజెక్ట్ ఫర్ వాటర్ సెక్యూరిటీ ఇన్ బెంగళూరు సిటీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ సమాజానికి నీరు, విద్యుత్ రెండూ కీలకమని, ఆ శాఖలను తానే పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. ఎస్ఎం కృష్ణ సీఎంగా ఉన్నప్పుడు నీటి సరఫరా, ప్రైవేటీకరణపై చర్చ జరిగిందని, అది మన రాష్ట్రంలో సాధ్యం కాదని సమాచారం ఇచ్చానని గుర్తుచేశారు. తాను మంత్రి అయిన తర్వాత కొందరు కొన్ని విభాగాల్లో ప్రైవేటీకరణకు ప్రతిపాదనలు తెచ్చారని, తాను అంగీకరించలేదని చెప్పారు. నీటి కాలువల పక్కన అర కిలోమీటరు మేర బోరుబావులు వేసేందుకు వీలు లేదన్నారు. కాలువల నీటిని నేరుగా ఉపయోగించుకునేందుకు లేదన్నారు. కొత్తచట్టానికి గవర్నర్ ఆమోదముద్ర వేశారని తెలిపారు. జలమండలి మనుగడ సాధించాలంటే నీటి చార్జీలు పెంచాల్సిందే అన్నారు. ఇదే సందర్భంలోనే ఉపకారాన్ని స్మరించుకోరని ఆయన చేసిన వ్యాఖ్యలపై జేడీఎస్ పార్టీ తీవ్రంగా మండిపడింది. అధికారంలోకి వచ్చేముందు ఉచితం ఉచితం అని.... గద్దెనెక్కగానే అన్ని ధరలు ఖచ్చితం... ఖచ్చితమని పెంచేస్తున్నారన్నారు. ఉపకారాన్ని స్మరించుకోవడం లేదంటూ ప్రజలను విమర్శించే నైతికత ఉందా అని ప్రశ్నించింది. అహంకారానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని జేడీఎస్ 'ఎక్స్'లో పేర్కొంది.



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

మద్యం అక్రమ విక్రయాలను అడ్డుకోండి

బంగారపేట, ఆగస్టు 22: ధనం సంపాదనే లక్ష్యంగా నియమాలను ఉల్లంఘించి మద్యాన్ని విక్రయాలు చేస్తున్నారని కొంతమంది వ్యాపారులు తమ దుకాణాలు, హోటళ్లలో మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నారని అంబేడ్కర్ సేవా సమితి ఆరోపించింది. సమితి రాష్ట్ర అధ్యక్షుడు, గ్రామపంచాయతీ సభ్యుడు కుపేంద్ర ఆధ్వర్యంలో గురువారం వినతిని సమర్పించారు. మద్యం అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ పట్టణంలోని వివేకానందనగర్‌లో అబ్కారీశాఖ కార్యాలయం ఎదుట సమితి ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. కుపేంద్ర మాట్లాడుతూ తాలూకా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో నిత్యావసరాలు, దాబా, హోటళ్లలో మద్యం అక్రమ విక్రయాలు సాగుతున్నాయని ఆరోపించారు. పీకలకదాకా మద్యం సేవించినవారు మహిళలు, చిన్నారులపై లైంగికంగా వేధిస్తున్నారన్నారు. ఇటువంటివారిపై చర్యలు తీసుకోవాలని, అంతేకాక అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కేంద్రాలను తొలగించాలని డిమాండ్ చేశారు. తాము సంబంధిత దుకాణదారులను విచారించగా తాము అబ్కారీ అధికారులకు మామూళ్లు ఇస్తున్నట్టు బదులిచ్చారన్నారు. చాలాచోట్ల మద్యం దుకాణాల ఏర్పాటులో నిబంధనలు అమలు కావడం లేదన్నారు. పాఠశాల, కళాశాలకు 200 మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఉండరాదనే నిబంధనలు అమలు కావడం లేదన్నారు. ఉదయం 9 గంటలకు తెరవాల్సిన దుకాణాలు చాలాచోట్ల తెల్లవారు జామున 5 గంటలకు తెరుస్తున్నారన్నారు.



వినతి పత్రం అందజేత

చాలాచోట్ల అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆక్రోశం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించకుంటే రానున్న రోజుల్లో బంగారపేట బంద్‌కు పిలుపు ఇస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సందేశ, కెసరినహళ్ళి శ్రీనివాస్, బూదికోటె శంకర్, షఫిక్, అలీం, అశోక్, సక్కనహళ్ళి రవి, మణి తదితరులు పాల్గొన్నారు.

సుస్థిరత లేకుంటే పర్యావరణ అభివృద్ధికి ఆటంకం

» డాక్టర్ ఎంఆర్ సీతారాం



బ్రోచర్ విడుదలలో ప్రముఖులు

బెంగళూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక ప్రగతికి ప్రాధాన్యత చూపుతున్న మనం పర్యావరణంపై నిర్లక్ష్యం చేయరాదని సుస్థిరతలేని అభివృద్ధి పర్యావరణానికి ప్రమాదకరమనేది ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని గోకుల ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు ఎంఆర్ సీతారాం అభిప్రాయపడ్డారు. రామయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సుస్థిర అభివృద్ధిలో ఆధునిక సాంకేతికత అనే అంశంపై గురువారం జరిగిన చర్చాగోష్ఠిలో మాట్లాడారు. విదేశాలలో ఇప్పటికే పర్యావరణంపై కొత్త విధానాలవైపు దృష్టి సారించారన్నారు. భవిష్యత్తులో ఇంజనీర్లు చేపట్టే ఏ ప్రాజెక్టు అయినా సుస్థిరతవైపు ఉండాలని సూచించారు. తక్కువ కార్బన్‌డయాక్సైడ్ విడుదలయ్యే ఉత్పత్తులను వాడాలన్నారు. పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత అనేది మరవరాదన్నారు. తాను ఇంజనీరింగ్ చదివేవేళ దేశంలో మెటీరియల్ సైన్స్‌లో చెప్పుకోదగ్గ సాంకేతికత అభివృద్ధి సాధించలేదన్నారు. జర్మన్ టెక్నాలజీ ప్రగతిదశలో ఉండేదన్నారు. ప్రస్తుతం కాలం మారిందని ఇక్కడ కూడా సాంకేతికత ప్రగతి సాధిస్తోందన్నారు. మనం ఏం చేసినా సుస్థిర అభివృద్ధి దృష్టిలో పెట్టుకోవాలన్నారు. వీటీయూ మాజీ కులపతి, గోకుల సంస్థ అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ కరిసిద్దప్ప మాట్లాడుతూ మారుతున్న కాలఘట్టంలో కొత్తరీతి సాంకేతికత వచ్చిందన్నారు. వేగవంతంగా నిర్మాణాలు చేపడుతూ పర్యావరణానికి హాని కలిగించే ఉత్పత్తులు వినియోగించడం సరికాదన్నారు. సమాజం మరింత కాలం పర్యావరణంతో మమేకమై ఉండాలన్నారు. పర్యావరణానికి భంగం లేని ఉత్పత్తులను వినియోగించాలన్నారు. రామయ్య పరిశోధనా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ తరుణ్ శౌర్యదీప్ మాట్లాడుతూ మెటీరియల్ సైన్స్ విభాగంలో ఎన్నో పరిశోధనలకు అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ఆ దిశగా ప్రెజెంటేషన్ చేయడం మంచి పరిణామమన్నారు. అంతరిక్ష పరిశోధనలకు ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. అంతరిక్షంలోనూ వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బ్యాంకాక్‌లోని కింగ్‌మాంగ్‌కుట్ టెక్నాలజీ యూనివర్సిటీ ఇంటర్నేషనల్ టెక్నికల్ విభాగం అధ్యక్షుడు మ్యాలైమ్ శ్రీ అరియసుమ్, గోకుల సంస్థ డైరెక్టర్ ఎంఆర్ రామయ్య, బీఎస్ రాంప్రసాద్, ప్రిన్సిపాల్ ఎన్‌వీఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తాలూకా సమగ్ర అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే

దొమ్మసంద్ర, ఆగస్టు 22: బెంగళూరు నగరానికి అనుబంధంగా ఉన్న ఆనేకల్ శాసనసభ నియోజకవర్గం ఉపనగరంగా అన్ని విధాలా అభివృద్ధి చెందేందుకు అవకాశాలు ఉన్నాయని రోడ్లు, ఇతర మౌలికసదుపాయాలు కల్పించడం ద్వారా తాలూకాను సమగ్ర అభివృద్ధి చేయదలిచామని ఎమ్మెల్యే బీ శివణ్ణ తెలిపారు. తాలూకాలోని మరసూరు గ్రామపంచాయతీ పరిధిలో పలు సౌలభ్యాలు పంపిణీ చేసి మాట్లాడారు. పంచాయతీలను అభివృద్ధి చేసి రానున్న రోజుల్లో అప్‌గ్రేడ్ చేయనున్నట్టు తెలిపారు. ఎంపీ డాక్టర్ సీఎన్ మంజునాథ్ మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులకు ప్రతి లీటరుకు రూ.10 ప్రోత్సాహకధనం, విద్యార్థులకు ఇంగ్లీష్ స్కూల్, చెరువుల్లో భూగర్భజలాలు పెంచే కార్యక్రమాలు, పిల్లల ఆరోగ్యంకోసం హెల్త్‌కిట్‌లు ఇచ్చే పథకాలు ఉన్నాయన్నారు. మరసూరు గ్రామపంచాయతీ మాదిరిగా ఉండన్నారు. వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరసూరు గ్రామపంచాయతీలో స్వచ్ఛతా సంకీర్ణాన్ని ప్రారంభించారు. హైస్కూల్ విద్యార్థులకు సైకిళ్లు, అమృతసిరి లబ్ధిదారులకు ప్రోత్సాహకధనం అందచేసే కార్యక్రమాన్ని మంత్రి రామలింగారెడ్డి ప్రారంభించారు. మరసూరు గ్రామపంచాయతీ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు సోమశేఖర్, ఆనేకల్ నియోజకవర్గ గ్యారెంటీ పథకాల అమలు కమిటీ అధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి, పంచాయతీ సభ్యులు ప్రభాకరరెడ్డి, వెంకటస్వామిరెడ్డి, రశ్మి అనిల్‌కుమార్ రెడ్డి, కృష్ణప్ప, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యే తదితరులు

రాఘవేంద్రస్వామి మఠంతో
మైసూరు రాజులకు అన్యోన్య బంధం

» పీఠాధిపతి సుబుదేంద్రతీర్థ స్వామిజీ
» శ్రీమఠానికి సహకారం: యదువీర్

మంత్రాలయం, ఆగస్టు 22: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠానికి మైసూరు మహారాజ వంశీయులకు అన్యోన్య సంబంధం ఉందని మఠాధిపతి సుబుదేంద్రతీర్థ స్వామిజీ అభిప్రాయపడ్డారు. మఠం ఆరాధనా ఉత్సవాల్లో భాగంగా గురువారం ఊంజల మండపంలో మైసూరు యువరాజు, లోక్‌సభ సభ్యుడు యదువీర కృష్ణదత్త చామరాజేంద్ర ఒడెయార్‌కు రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి- 2024 అవార్డును ప్రదానం చేశారు. గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామిని దర్శించుకుని గర్భగుడి శిలాఫలకానికి పైభాగాన అమర్చిన బంగారు కవచాన్ని ఎంపీ పరిశీలించారు. అవార్డు అందజేసిన అనంతరం పీఠాధిపతి మాట్లాడుతూ మైసూరు రాజవంశానికి రాఘవేంద్ర స్వామి మఠానికి ఆధ్యాత్మిక అన్యోన్య అనుబంధం ఉందని గుర్తు చేశారు. గత పరంపర మహారాజులు సైతం రాఘవేంద్రస్వామికి ఎంతో సేవలు అందించారన్నారు. మైసూరు యువరాజు మాట్లాడుతూ వంశపారంపర్యంగా సంప్రదాయాలకు అనుగుణంగా శ్రీమఠం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం హెలికాప్టర్‌లో పీఠాధిపతితో కలిసి మఠంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చక్కర్లు కొట్టి పరిశీలించారు. మంత్రాలయం అభివృద్ధి పనులు వర్ణించలేనివని ఈ అవార్డు తనకు దక్కడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో విద్వాన్ రాజా ఎస్ గిరిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి, ఐపీ నరసింహమూర్తి, ఉత్తర భారత విచారణ కర్త శ్రీనివాస్ ఖస్బే ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, డీఎం ఆనందరావు పాల్గొన్నారు.



మైసూరు యువరాజుకు అవార్డు అందజేత

రోగులకు పాలు, పండ్లు పంపిణీ

బెంగళూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజును పురస్కరించుకుని నగరంలోని మాగడిరోడ్డులోగల బెంగళూరు జిల్లా కుష్ఠిరోగి కేంద్రం ఆసుపత్రిలోని రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. చిరంజీవి అభిమానుల సంఘం అధ్యక్షుడు హెచ్‌ఎస్ కుమారస్వామి మాట్లాడుతూ తమ అభిమాన నటుడు పుట్టినరోజును గురువారం అర్థవంతంగా ఆచరించామన్నారు. రోగులకు పాలు, పెరుగు, బ్రెడ్, బిస్కట్స్, పండ్లు అందచేశామన్నారు. ఈ సందర్భంగా అభిమానులు మునిరాజు, ఆనంద్, వెంకటేష్, శివకుమార్, శివశంకర్, దర్శన్ కుమార్, లోకేష్‌కుమార్, హర్ష తదితరులు పాల్గొన్నారు.



పండ్లు అందచేస్తున్న చిరంజీవి అభిమానులు

ఈదురుగాలులతో పంటనష్టం

శిడ్లఘట్ట, ఆగస్టు 22: ఈదురు గాలుల కారణంగా తాలూకాలో పలుచోట్ల పంట నష్టం వాటిల్లింది. తాలూకాలోని సాదలి హోబళి దిబ్బూరహళ్ళి గ్రామపంచాయతీ బైయప్పనహళ్ళి నరసింహారెడ్డికి చెందిన పాలి హౌస్, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. పాలిహౌస్‌లో చెండుమల్లె, టమోటా ఇతర పంటలు పండిస్తుండగా ఈదురు గాలులు, వర్షాలతో సుమారు 7 లక్షల రూపాయల మేర నష్టపోయినట్టు రైతు వాపోయాడు. రాజకాలువ ఆక్రమణతో వర్షపునీరు పంటల్లోకి వస్తోందనే విషయాన్ని ఇప్పటికే జిల్లాధికారుల సమావేశంలో సమర్పించినా ప్రయోజనం లేకపోయిందన్నారు. అప్పు చేసి ఐదు ఎకరాలలో మొక్కజొన్నపంట వేశానన్నారు. గత ఏడాది వర్షం లేక పంట నష్టపోయానని, పంటలబీమా ఉన్నా పరిహారం అందలేదన్నారు. ఈసారి ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయానని ఇలాగైతే అప్పులు ఎలా తీర్చాలని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని అధికారులను కోరారు. మరో రైతు అక్కులరెడ్డి మాట్లాడుతూ నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పలువురు రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. గ్రామ పాలనాఅధికారి, తోటల శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలించి పంటనష్టంపై నివేదికను ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు.



పరిశీలిస్తున్న అధికారులు

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

టంగుటూరి ప్రకాశం పంతులు (జయంతి)



'ఆంధ్రకేసరి'గా పేరొందిన టంగుటూరి ప్రకాశం పంతులు 1872 ఆగస్టు 23న ఇప్పటి ప్రకాశం జిల్లా వినోదరాయుని పాలెము గ్రామంలో జన్మించారు. స్వాతంత్ర్య సమర యోధుడు, మద్రాస్ ప్రెసిడెన్సీ విడిపోయి ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయన వారాలు చేసుకుంటూ చదువుకున్నారు. అనంతరం స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక భాగస్వామ్యులై, రాజకీయాల్లో రాణించి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. సైమన్ కమి షన్ ప్రదర్శనలో తుపాకికి ఎదురొడ్డినందుకు 'ఆంధ్ర కేసరి'గా పేరొందారు. ప్లీడరు నుంచి బారిష్టరుగా ఎదిగి ఆర్థికంగా నిలదొక్కుకున్నా తన యావదాస్తిని దేశసేవకే ఖర్చు చేశారు. 1957 మే 20న పరమపదించారు. జాతికి చేసిన సేవలకు గుర్తుగా ఒంగోలు జిల్లాను 1972లో ప్రకాశం జిల్లాగా మార్చారు.

ప్రొఫెసర్ జీ వెంకటసుబ్బయ్య (జయంతి)



కన్నడ నిఘంటువు రూపకర్త 'పద్మశ్రీ' గ్రహీత వెంకటసుబ్బయ్య 1913 ఆగస్టు 23న కర్ణాటక రాష్ట్రం మండ్య జిల్లా శ్రీరంగపట్టణంలో జన్మించారు. కన్నడ భాష, సంస్కృతిపై మక్కువ కల్గిన సాహితీవేత్త. ఉపాధ్యాయుడిగా కెరీర్ ప్రారంభించి ప్రొఫెసర్‌గా ఎదిగారు. 12 నిఘంటువు (డిక్షనరీ) సంపుటాలను రాశారు. కవితలు, వ్యాకరణం, వ్యాసాలు వంటివి కన్నడ లోకి అ నువాదం చేశారు. 60కుపైగా పుస్తకాలు రాశారు. పలు పత్రికలలో ఆయన రచనలు ప్రచురితమయ్యాయి. 2011లో బెంగళూరులో జరిగిన 77వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షులుగా వ్యవహరించారు. కన్నడ రాజ్యోత్సవ, పంప అవార్డు, కన్నడ సాహిత్య అకాడమీ అవార్డు తదితర పురస్కారాలు అందుకున్నారు. 107వ యేట 2021 ఏప్రిల్ 19న కన్నుమూశారు.

గురు బిపిన్ సింగ్ (జయంతి)




'మణిపురి' నృత్య పితామహగా పేరొందిన గురు బిపిన్‌సింగ్ 1918 ఆగస్టు 23న అస్సోం రాష్ట్రం కాచార్ జిల్లా కేంద్రమైన సిల్చార్ లో జన్మించారు. దర్శకుడు, కొరియోగ్రాఫర్, టీచర్‌గా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఇంఫాల్‌లో గోవింద్ జీ నర్తనాలయ డ్యాన్స్ స్కూల్ ఫర్ ఉమెన్, కోల్కత్తాలో మణిపురి నర్తనాలయ డ్యాన్స్ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. నృత్య రూపకాలు, నాటికలు ప్రదర్శించి పేరొందారు. మణిపూర్ మహా రాజా నుంచి 'హంజాబా', సంగీత నాటక అకాడమీ అవార్డు, శిరోమణి పురస్కార్, కాళిదాస్ సమ్మాన్ తది తర గౌరవాలు పొందారు. 2000 జనవరి 9న కన్నుమూశారు.

కేకే (జయంతి)



కేకేగా సుపరిచితులైన కృష్ణ కుమార్ కున్నత్ 1968 ఆగస్టు 23న న్యూఢిల్లీలో నేపథ్య గాయకుడిగా హిందీ, తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, మరాఠా, బెంగాలీ, గుజరాతీ భాషలలో పాటలు పాడారు. 3,500కుపైగా జింగిల్స్ ఆలపించారు. సంగీత దర్శకుడు, రచయితగాను సత్తా చాటుకున్నారు. సోని మ్యూజిక్ విడుదల చేసిన 'పాల్' ఆల్బమ్ ఎంతో పేరొందింది. ఉత్తమ నేపథ్య గాయకుడిగా ఫిల్మ్‌ఫేర్, స్ర్కీన్ అవార్డ్, జీ సినీ అవార్డ్ అందుకున్నారు. 2022 మే 31న కన్నుమూశారు.

కోబి బ్రాయంట్ (జయంతి)



'బ్లాక్‌మాంబా'గా గుర్తింపు పొందిన అమెరికన్ బాస్కెట్ బాల్ క్రీడాకారుడిగా రాణించిన కోబి బ్రాయంట్ 1978 ఆగస్టు 23న ఫిలడెల్ఫియాలో జన్మించారు. 20 ఏళ్ల కెరీర్‌లో షూటింగ్ గార్డ్‌గా సత్తా చాటుకున్నారు. లేకర్స్ ఫ్రాంచైస్ హిస్టరీలో ఆల్‌టైమ్ లీడింగ్ స్కోరెర్‌గా నిలిచారు. నేషనల్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్స్‌లో ఐదుసార్లు గెలుపొందారు. 20 సీజ న్స్‌లో తొలి గార్డ్‌గా నిలిచారు. తన నిక్‌నేమ్ 'బ్లాక్ మాం బా'గా పెట్టుకున్నాడు. పలు సేవా కార్య క్రమాల్లోనూ పాల్గొని స్ఫూర్తిగా నిలిచారు. 41వ యేట విమాన ప్రమాదంలో 2020 జనవరి 26న కన్నుమూశారు.

సైరాబాను (పుట్టినరోజు)



ప్రముఖ హిందీ నటి సైరాబాను 1944 ఆగస్టు 23న ఉత్తరాఖండ్ రాష్ట్రం ముస్సోరిలో జన్మించారు. 1960, 70 దశకాలలో అత్యంత ప్రజాదరణ కల్గిన నటిగా గుర్తింపు పొందారు. అప్పట్లో రొ మాంటిక్ హీరోయిన్‌గా రాణించారు. ఉత్తమనటిగా నాలుగు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. ప్రముఖ నటుడు దిలీప్ కుమార్‌ను పెళ్లి చేసుకున్నారు. జంగ్లీ, బ్లఫ్‌మాస్టర్ (1963), విక్టోరియా నెం.203, హేరా ఫెరి, బైరాగ్ తదితర సినిమాలు ఎంతో పేరొందాయి.

మార్కెట్‌లోకి ఆర్గానిక్ లోదుస్తులు

బెంగళూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): దేశీయ మార్కెట్ లోకి సరికొత్తగా ఆర్గానిక్ లోదుస్తులు పరిచయం చేస్తున్నామని తెస్వాటి సంస్థ డైరెక్టర్ రమేశ్ కొఠారి అభిప్రాయపడ్డారు. నగరంలో గురువారం ఆర్గానిక్ కాటన్, లెంజిమ్ మోడల్‌తో రూపొందించిన లోదుస్తులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేశ్ కొఠారి మాట్లాడుతూ జీవనశైలి, సౌకర్యం, నాణ్యత, స్థిరత్వాన్ని పాటించే దిశగా టెస్వాటి ఉత్పత్తులు మేక్ ఇన్ ఇండియా పరిజ్ఞానంతో రూపొందించామన్నారు. పర్యావరణ స్పృహతో ఉత్ప త్తులకు డిమాండ్ పెరుగుతున్న తరుణంలో ఆర్గానిక్ దుస్తులు తయారు చేశామన్నారు. హానికరమైన రసాయనాలు, కృత్రిమ ఎరువులు వాడకుండా పండించిన సేంద్రీయ పత్తిని వాడామన్నారు. ఆర్గానిక్ కాటన్, ఇంటర్‌లాక్ ఫ్యాబ్రిక్ వంటివి ప్రత్యేకతలుగా పేర్కొన్నారు.



దెబ్బతిన్న మొక్కజొన్న పంట

ఘనంగా రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవం

బాగేపల్లి, ఆగస్టు 22: గురు రాఘవేంద్రస్వామి 353వ ఆరాధనా మహోత్సవం పట్టణంలోని మెయిన్‌రోడ్డు లోగల మఠంలో గురువారం చివరి రోజు ఉత్తరారాధాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. సుప్రభాతసేవ అనంతరం మూలవిరాట్టుకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అష్టోత్తర పారాయణ నిర్వహించారు. రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. భజనమండలి ముఖ్యులు మునిరాయ్య నేతృత్వంలో భక్తిగీతాలాపన, భజనలు, సంగీత కార్యక్రమాలు సాగాయి. ఆలయ సేవా ట్రస్టు పదాధికారులు చిత్తరంజన్, పాండురంగ, సీవీ వెంకటరామ్, శ్రీనివాస్ తంత్రి, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి అలంకరణ

ప్రకాశనాథస్వామీజీకి పురస్కారం



పురస్కారం అందజేత

బెంగళూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గురు రాఘవేంద్రస్వామి 353వ ఆరాధనా మహోత్సవంలో భాగంగా గురు రాఘవేంద్ర అనుగ్రహ పురస్కారం బీజీఎస్, ఎస్‌జేబీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ ప్రకాశనాథస్వామిజీకి దక్కింది. ఈనెల 24వరకు ఆరాధన మహోత్సవాలు జరగనున్నాయి. మంత్రాలయంలో ఏర్పాటైన ఉత్సవంలో సుబుదేంద్రతీర్థ స్వామిజీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రకాశనాథస్వామిజీ మాట్లాడుతూ గురువుల ఆశీర్వాదం ఉంటే సాధ్యం కానిది ఏమీ ఉండదన్నారు. ధృఢ సంకల్పంతో గురువుల మార్గదర్శకంలో సాగితే మంచి జరుగుతుందన్నారు.

మీ కుమార్తెను ప్రేమిస్తున్నా..
నిరాకరిస్తే చంపేస్తా

» హుబ్బళ్లిలో యువకుడి బెదిరింపు

బెంగళూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మీ కుమార్తెను ప్రేమిస్తున్నా ఒకవేళ నిరాకరిస్తే నేహా హిరేమఠ్ తరహాలో దారుణంగా హత్య చేస్తానని బెదిరింపులకు పాల్పడిన సంఘటన హుబ్బళ్ళిలో చోటు చేసుకుంది. ఈ మేరకు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో అబ్బాస్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి జ్యూడీషియల్ కస్టడీకి పంపారు. బాలిక పాఠశాలకు వెళ్లే సమయంలో అబ్బాస్ స్నేహం చేశాడు. ఆ తర్వాత కొన్నిసార్లు పార్కుకు తీసుకెళ్లాడు. జూన్ 22న పాఠశాలనుంచి ఇంటికి తీసుకెళ్తానంటూ రేవడిహాళ బ్రిడ్జ్ వద్ద అత్యాచారానికి యత్నించాడు. వివాదం సద్దుమణగడంతో ఎవరికివారు మిన్నకుండిపోయారు. ఈనెల 18న అబ్బాస్ బాలిక ఇంటికి వచ్చి గొడవ చేశాడు. బాలికను అటూ ఇటూ లాగి దాడి చేసేందుకు ప్రయత్నించాడు. నా ప్రేమను నిరాకరిస్తే నేహా హిరేమఠ్ తరహాలోనే హతమారుస్తానంటూ బెదిరించాడు. కసబ పేట పోలీసులు అబ్బాస్‌పై బుధవారం కేసు నమోదు చేశారు.

గౌరీలంకేశ్ కేసు నిందితుడికి బెయిల్‌మంజూరుపై...
సుప్రీంలో పిటిషన్ కొట్టివేత

బెంగళూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సీనియర్ పాత్రికేయురాలు, సామాజిక ఉద్యమకారిణి గౌరిలంకేశ్ హత్యకేసులో నిందితుడు మోహన్‌నాయక్‌కు కర్ణాటక హైకోర్టు మంజూరు చేసిన బెయిల్ రద్దు చేయాలనే పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో మోహన్ నాయక్‌కు ఊరట లభించింది. కర్ణాటక హైకోర్టు నిర్ణయంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బేళా ఎం త్రివేది, సతీశ్ చంద్రశర్మల ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఆరోపితుడు విచారణకు సహకరిస్తున్నాడా అని ప్రశ్నించింది. 2023 డిసెంబరు 7న మోహన్ నాయక్‌కు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీన్ని ప్రశ్నిస్తూ గౌరి లంకేశ్ సోదరి కవితా లంకేశ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గురువారం వైరల్ అయ్యింది.

నిద్రిస్తున్న తమ్ముడిని...
హతమార్చిన అక్కలు

బెంగళూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చిక్కమగళూరు జిల్లా తరికెరె పట్టణం చౌడేశ్వరి కాలనీలో నిద్రిస్తున్న తమ్ముడు రాఘవేంద్ర (43)ను ఓ బావతోపాటు ముగ్గురు కలసి హతమార్చారు. గురువారం ఉదయం నిద్రిస్తున్న వేళ కళ్లల్లో కారప్పొడి చల్లి అతను లేసే ప్రయత్నం చేసేలోగానే పొడిచి పొడిచి చంపారు. ఆస్తి కోసం అక్కలు, తమ్ముడి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవని స్థానికుల ద్వారా తెలిసింది. సంఘటనా స్థలాన్ని ఎస్పీ విక్రమ్ అమటే పరిశీలించారు. తరికెరె పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.